# ప్రళయం

రాజగోపాలనాయుడు నోట్లోని పైప్‌ను తీసి పట్టుకుని చేయిని ప్రక్కకు చాచాడు.

వెంటనే పి.ఎ. పైప్‌ను అందుకుని "మహాప్రసాదం...చిత్తం ప్రభూ'' అన్న పోజుపెట్టి గాడిదలా యికిలించాడు.

ప్రక్కనే విలబడ్డ నర్సింలు ఓ బరువైన గులాబీపూల దండను అందించాడు రాజగోపాలనాయుడుకు.

నాయుడు తలెత్తగానే ఎదురుగా కీర్తిశేషురాలై నవ్వుతున్న భార్య నిలువెత్తు తైలవర్ణ చిత్రం కనిపించింది. రొటీన్‌గా గులాబీ పూల దండను చిత్రానికి తగిలించాడు. ఈలోగా ఫోన్ దొంగను చూచిన కుక్కలా ఎడతెరిపిలేకుండా అరవడంమొదలెట్టింది.

పి.ఎ. గబగబా పరుగెత్తి రిసీవరెత్తి—

"మీకోసం అనంతశయనంగారు..." అన్నాడు.

నాయుడు గబగబా నడిచాడు ఫోన్ దగ్గరకు.

"యస్ నాయుడూ హియర్..."

"గుడీవినింగ్‌సర్...మన సినిమా ప్రింట్ పూర్తయింది. అతి కష్టంమీద తయారుచేయగలిగాను. మీరు వెంటనే బయలుదేరివస్తే ఫస్టు ప్రింట్ ప్రీవ్యూ చూద్దాం. రేపు ఉదయం సెన్సార్‌కు సబ్‌మిట్ చేద్దాం."

"యిప్పుడే చూద్దామంటావా."

"యిప్పుడు చూడడమే మంచిది. అజంతా థియేటరు ఈ పూటకు ఖాళీగావుంది. మాట్లాడాను. మన టెక్నీషియన్స్ కెక్కడా చెప్పాను ఆరు గంటలకు రమ్మని. కొందరు యిప్పటికే వచ్చారు కూడా. యిక మీరొస్తే షో ప్రారంభిద్దాం..."

"ఐతే నేనుకూడా వస్తాను నాదేముంది...అంతా రెడీ చేయండి".

"రైట్ సర్."

ఫోన్ పెట్టేశాడు నాయుడు. పెట్టి "మనం వెంటనే అజంతా థియేటర్‌కు వెళ్ళాలోయ్ మన సీనిమా ఫస్ట్ ప్రింట్ ప్రీవ్యూ వుంది" అన్నాడు పైప్‌ను వెలిగించుకుంటూ.

"మేం గూడా వస్తాం డాడీ"

నాయుడు చటుక్కున వెనుదిరిగాడు.

రాము, పుణ్య

"ఎంత సేపయింది మీరు స్కూల్ నుండొచ్చి?"

"యింతకు ముందే."

"మీరెందుకూ యింటి దగ్గరుండండి."

"అబ్బబ్బ వస్తాండాడీ..." పుణ్య అంది గోముగా.

పుణ్య పదవక్లాసు చదువుతోంది. రాము యింటర్‌లో వున్నాడు.

"ఊఁ...సరే ఐతే....రెడీ కండి ఐదు నిముషాల్లో."

నాయుడు మెట్లుదిగి విశాలమైన హాల్లోకి నడిచాడు. పిల్లలు గంతులువేస్తున్న కుందేళ్ళలా తుర్రుమన్నారు గదుల్లోకి.

పది నిముషాల తర్వాత రాజగోపాలనాయుడు శ్రీమత్‌కారు షటిల్ పడవలా మెత్తగా బయలుదేరింది. పిల్లలు వెనకసీట్లో స్వర్గాన్ని చూడబోతున్న రాక్షసుల్లా అత్యంతానందంగా కూర్చున్నారు.

నాయుడు తలలో తను నిర్మించిన సినిమా సెన్సార్‌లో ఎలా నెగ్గుకొస్తుందో, ఏ సర్టిఫికెట్ దొరుకుతుందో—ఎంత కలక్షన్స్ వసూలు చేస్తుందో, ఏ డిస్ట్రిబ్యూటరికిస్తే బాగుంటుందో.... లాంటి ఆలోచనలు సుడిగాలిలో కాగితం ముక్కల్లా తేలిపోతున్నాయి.

పావుగంటలో కారు అజంతా థియేటర్ చేరింది.

దర్శకుడు, టెక్నీషియన్స్ పెంపుడు కుక్కల్లా పరుగెత్తుకొచ్చారు దగ్గరకు. పెదవులపై అతికించుకున్న నవ్వులో.

"రేపు సెన్సార్‌కు సబ్‌మిట్‌చేస్తే మన పీడా వదుల్తుందండీ" అంటున్నాడు దర్శకుడు.

"ఊర్కే సబ్‌మిట్‌చేస్తే మన సిన్మా పోయేటప్పుడు పెట్టెలో పోయి వచ్చేప్పుడు ఓ పాకెట్లో మీటరో, అరమీటరో ఐ వస్తుంది... అందుకని."

"సరే సర్."

థియేటర్లోకి నడుస్తున్నారందరూ.

"యింతకూ పేరేది సెటిల్ చేశారు సినిమాకు?"

"తృష్ణ, స్త్రీ .... నిషా" .... యీ మూడింటినీ పిక్చరైజ్ చేయించాను. యిప్పుడు సినిమానంతా మనం చూచి ఏదో ఒకదాన్ని ఖాయం చేద్దాం"...

"రైట్—"

అందరూ సీట్లలో కూర్చున్నారు.

రామునూ, పుణ్యనూ సినిమా ఫోటోగ్రాఫర్ నాయుడు ముందర అతి అప్యాయంగా ముద్దాడుతున్నట్టు నటిస్తూ పిల్లలను తన ప్రక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

హాలంతా చీకటై తెరమీద బొమ్మపడ్డది.

ముందు 'ఆమె' ఒంటిమీద చీరను విడిచి...లంగాను వదిలేసి.... తొడలదాకా నగ్నంగా నడుస్తూ...బాత్‌రూం దిక్కు అడుగు లేస్తూ—

ఆమె నున్నని భుజాలు...

అనాచ్ఛాదితమైన వీపు....

తొడలు...పిక్కలు—

హైటిల్స్ పడుతున్నాయి.

ఆమె ముఖం నిండా విరహం...తాపం...దాహం.

ఒంటిని ధనుస్సులా విరిచి ఆవులించింది.

....యింతలో అతను వచ్చి...తలుపుకొట్టి—

ఆమె సన్నగామూల్గి... "కమిన్" అంది.

అతను లోపలికి బాణంలా దూసుకుపోయి.

ఒకరిపై ఒకరు....ఒకరి పెదవులపై మరొకరి అధరాలు... పెనవేసుకుపోతూ...సుడితిరిగిపోతూ...యిద్దరూ కళ్ళనిండా కోరికతో కాలిపోతూ—

రాము చుట్టూ చూశాడు చీకట్లో.

యిటుప్రక్కన చెల్లెలు పుణ్య. అటుదిక్కు ఫోటోగ్రాఫర్ శ్రీనివాసన్...అందరూ తీక్షగా సినిమా చూస్తున్నారు.

వెనుక తండ్రి డైరెక్టర్ అనంతశయనంతో ఏదో మాట్లాడు తున్నాడు.

రాము నరాల్లో పొంగుతున్న వేడిని అణుచుకుంటూ... తెరదిక్కు ముఖం తిప్పాడు.

పడకగది సీను పదినిముషాలు వరుసగా నడచి నడచి—

హీరోయిన్ పరుగెత్తుతోంది బయటికొచ్చి రైలుపట్టాలవెంట. ఆ పరుగెత్తడంలో ఎగిరెగిరిపడే వక్షోజాలు అదిరే పెదవులు—

ప్రతి ఫ్రేంలో.... ప్రతి కోణంలో సెక్స్.

సెక్స్... సెక్స్... సెక్స్—

పుణ్యవైపు చూశాడు మళ్ళీ.

తీక్షగా చూస్తోంది జరుగుతున్నదాన్ని. ఆమె కళ్ళనిండా సముద్రంలోలా అలజడి... అలజడి.

సినిమా యింకా అనేక శృంగారరస ఘట్టాల్లోకి పరుగెత్తుతోంది. హీరోయిన్ తన వయసు చేసే అల్లరికీ, రేపే కోరికలకీ లొంగి విచక్షణను కోల్పోయి అస్తవ్యస్త పరిస్థితుల్లో తనకు తెలియకుండానే తను ఎలా పతనమైందీ సినిమాలో చూపించబడింది. స్పష్టంగా.... వివరంగా. చిత్రంనిండా శృంగార క్రీడలన్నీ చూపించి—చివరకు యిలా చేయడం తప్పు అని తీర్మానిస్తాడు దర్శకుడు.

రెండు గంటలసేపు రాసలీలా విలాస సముద్రంలోకి మనసుని ఎగరేసుకుపోయీపోయీ తీయగా నలిపి నలిపి మెదడునిండా కోరికలను పులిమి, మంటలను రేపి, రేపి ... నరాలను ఉడికించి ఉడికించి ముగిసింది.

రాము చటుక్కున లేచి బైటకు వచ్చేశాడు లైటు వెలగగానే. పుణ్య తలవంచుకుని సిగ్గుతో నడుస్తోంది.

యువతంతా తమ కృషి ఎలా ప్రదర్శితమైందీ చెప్పుకుంటున్నారు. ఒకరితో ఒకరు.

నాయుడూ, అనంతశయనం పిక్చర్‌తో సెన్సార్ సముద్రాన్ని ఈదే ప్రోగ్రాం గురించి చర్చిస్తున్నారు.

రామువచ్చి కార్లో కూర్చున్నాడు. పుణ్య కూడా నిశ్శబ్దంగా వచ్చి వెనకసీట్లో కూర్చుంది. ఒకరి ముఖం ఒకరు చూచుకోవాలంటే మహాభయంగా, చచ్చేంత సిగ్గుగా, అసహ్యంగా వుంది.

పావుగంట గడిచింది.

ఓ బాయ్ ఫిల్మ్ రోల్స్ వున్న డబ్బాను తెచ్చి వెనుక డిక్కీలో పెట్టాడు. నాయుడు అందరికీ నమస్కారంచేసి పైప్ వెలిగించుకుంటూ కారెక్కాడు. కారు కదిలింది.

కార్లోని మనసుల నిండా మహా ప్రళయ గర్జనలు. మనషుల నడుమ చిక్కగా నిశ్శబ్దం.

o o o o o

సినిమా గనుక ఉన్నదున్నట్టు బయటికొస్తే ఓహ్. ఇంకేముంది ....కుర్రకారంతా ఎగబడి ఫిల్మ్ అరిగి తెగిపోయేదాకా చూచి తన అకౌంట్‌లో....ఎన్ని అంకెలో....

కాని ఎలా దాన్ని ఉన్నదున్నట్టు బయటికి తీసుకురావడం.

సెన్సార్ బోర్డులో ఎవరెవరిని పట్టుకుని ఏమేమి చేస్తే జరుగుతుందీ పని? అంతా సవ్యంగా జరగాలంటే?

ఎంతయినా....ఎలాగైనా....

ఈ పని జరగాలి.

"బట్ హౌ...హౌ—"

తలనిండా ఆలోచనలు...ఆలోచనలు...ఆలోచనలు.

నిద్ర రావడంలేదు నాయుడుకు.

○ ○ ○ ○ ○

మంచంపై లేచి కూర్చున్నాడు. పైప్ వెలిగించుకున్నాడు

ఎదురుగా ఫిల్మ్ డబ్బా...దాని వెనుక కనిపించని నోట్ల కట్టలు—

మళ్ళీ ఆలోచనలు.

సెన్సార్ రిలీజ్...సర్టిఫికేట్...డబ్బు....డబ్బు...డబ్బు.

లేచి నిలబడి...బయటికొచ్చి...లాంజ్‌లో పచార్లుచేస్తూ—

మనసునిండా ఒకటే రగడ.

అకస్మాత్తుగా మేడపైన ఏదో వస్తువు క్రింద పడ్డట్టు భళ్ళున చప్పుడైంది.

ఏమై వుంటుంది—

గబగబా మెట్లెక్కి—. రాము గదిలోనే చప్పుడు.

లోపల జీరో లైటు వేసి వుంది. గాజు తలుపులో నుంచి కనబడుతోంది లోపలి భాగం.

రాము మెల్లగా లేచి....పుణ్య మంచం ప్రక్కన నిలబడి... ఆమెపైకి వంగి — బోర్లా పడుకునివున్న ఆమె జాకెటు హుక్స్ తీస్తున్నాడు.

ఆమె ఏమీ అనడంలేదు. నిద్రలో వున్నదేమో—

ఒంటిపైనున్న దుప్పటిని తీసేశాడు. చీరను మెల్లగా పైకి జరుపుతూ—

రాము కళ్లనిండా భయం...కోరిక...కసి.

పుణ్య గోముగా వెల్లకిలా తిరిగింది. పైటజారిన ఆమె లేస్తనాలు.

కళ్లు మూసేఉన్నాయి...నిజంగా నిద్రపోతుందా...లేక...

ఒక అన్న...తన స్వంత చెల్లెలును...

నాయుడు తలలో తన సినిమా రీళ్లు....దృశ్యాలు మహావేగంగా కదులుతున్నాయి .... ఈ రోజు రాత్రే తన సినిమా చూచి...దాని తీవ్రమైన ప్రభావానికి లొంగి....విచక్షణను కోల్పోయి.

రాము పుణ్య చీరను యింకా పైకి జరుపుతూ...పిక్కలు....తొడలు....

"నో...నో....నో—"

ఛటున తలుపులను బద్దలు చేసుకుని చొచ్చుకొచ్చి రాముని జుట్టు పట్టుకుని తనవైపు త్రిప్పి టపాటపా చేయి నొప్పెట్టేదాకా చెంపలు వాయించి మెడపట్టి గదిలో నుంచి బయటికి గెంటేసి—

o o o o o

సిగరెట్టు చురుక్కుమంది. సిగరెట్టు కాలుస్తూనే నిద్రపట్టేసింది. భయంకరమైన పీడకల. గుండె దడ తగిలింది.

నాయుడు తల నిండా ప్రళయం....సిగ్గు...సిగ్గు....

గబగబా క్రిందికి వురికొచ్చి వీధిలోకి చూశాడు.

దరదరా తన గదిలోకి పురికి.... ఫిల్మ్ డబ్బాను బరబరా బయటికి లాక్కొచ్చి తాళంతీసి. ... పిచ్చివాడిలా రీళ్ళన్నింటినీ ఫర్ ఫర్రన లాగి అగ్గిపుల్ల గీసి అంటించి—

మంట .... మంట.

మంట ఏపుగా, ఎర్రగా మండుతోంది అతని మనసులా.

మంటముందు నాయుడు ముఖం వెలిసిపోయిన రంగు కాగితంలా వికారంగా వుంది.

అతని కళ్ళు మాత్రం వెలుగులో మెరుస్తున్నాయి.